Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 81 • సంచిక: 6 • 5-2-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

జమీన్ రైతు
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

లేజర్ చికిత్స
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

# ఉద్యమం కృష్ణార్పణం!

## అందరినీ అయోమయానికి నెట్టిన చిదంబరం

తాళం వేసితిని, గొళ్లెం మరచితిని.. అన్నట్లు వేశాడు కృష్ణ కమీషన్‌ను కేంద్ర హోంమంత్రి చిదంబరం. తెలంగాణ వాదులకు చెప్పినట్లే ఆయన ఫిబ్రవరి మొదటి వారంలో కమిటీ వేశాడు. కానీ అందులో తెలంగాణ అన్న పదం చేర్చడం మరచిపోయాడు. తెలంగాణ వాదులు కోరింది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తీసుకోవలసిన చర్యల గురించి అధ్యయనం చేయడానికి కమిటీ నియామకం. కానీ చిదంబరం చేసింది. రాష్ట్రంలో వున్న భిన్న వాదనలు, అభిప్రాయాలు, వ్యక్తుల మనోభావాలను అర్థం చేసుకోవడానికి చర్చలు జరపడం మాత్రమే. ఆ కమిటీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లేదు, కమిటీకి ఒక కాల పరిమితి అంతకంటే లేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఇదేమీ సిఫార్సు చేయదు. ఒకవేళ రాష్ట్రం ఏర్పడితే తీసుకోవలసిన చర్యల గురించి అసలు మాట్లాడదు. రాష్ట్ర విభజనపై చెలరేగుతున్న భిన్నాభిప్రాయాలను క్రోడీకరించడం మాత్రమే కమిటీ పనిగా వుండబోతున్నది.

కర్ర విరగకుండా, పాము చావకుండా రామాయపట్నం మధ్యస్తం చేశాడు చిదంబరం. తన లిటిగెంట్ పరిజ్ఞానం మొత్తాన్ని అందులో రంగరించాడు. సీనియర్ లాయర్ అనిపించుకొన్నాడు. రాష్ట్ర ఏర్పాటు నిజంగా ఆయన ఉద్దేశమైతే, రాజకీయ పరమైన కమిటీలు వెయ్యాలి తప్ప, న్యాయ సంఘాలు కాదు. కృష్ణ కమిటీలో అన్ని రంగాల నిపుణులున్నా స్థూలంగా దీని స్వరూపం న్యాయ విచారణ సంఘం క్రిందే లెక్క. అందువల్ల రాష్ట్ర విభజనకు ఇప్పటికిప్పుడు తాను సిద్ధం కాదని చెప్పకనే చెప్పాడు. అట్లని తెలంగాణ వాదులను పూర్తిగా నిరాశపరచలేదు. తెలంగాణ అనే పేరు ప్రస్తావించకపోయినా ఈ కమిటీ జరిపే చర్చలు, సేకరించే అభిప్రాయాలు దానిమీదనే వుంటాయి. అందువల్ల తెలంగాణవాదులు తాము ఏమి చెప్పాలనుకొంటే అది చెప్పవచ్చు.

ఈ కమిటీ అందరినీ అయోమయంలోకి నెట్టింది. వ్యతిరేకించనూ లేక, స్వాగతించనూ లేక నలిగి పోతున్నారు. 8వ తేది కమిటీ ప్రథమ సమావేశంలో కమిటీ ఏఏ అంశాలపై పరిశీలన చేస్తుందో, ఎంత కాలవ్యవధి తీసుకొంటుందో నిర్ణయం తీసుకొంటుందట. ఆ తంతు ముగిసే వరకు ఎవరూ ఏమీ మాట్లాడలేని పరిస్థితి.

ఢిల్లీ నుంచి అందుతున్న వార్తల ప్రకారం, రాష్ట్ర విభజన వల్ల తలెత్తే మావోయిస్ట్ సమస్య మీద కూడా ఈ కమిటీ అధ్యయనం చేస్తుందట. రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ పట్టుబట్టి మరీ ఆ అంశాన్ని చేర్పిస్తున్నారట. దాని అర్థం, తెలంగాణ ఏర్పాటుతో మావోయిస్ట్ సమస్య ఉధృతమౌతుందన్న ప్రచారాన్ని కల్గించడం. అదే జరిగితే తెలంగాణ ఏర్పాటుకు తొలగించలేని ప్రతిబంధకం ఏర్పడుతుందన్న మాట.

కమిటీ పరిశీలనకు హద్దులు లేవు కాబట్టి, ప్రత్యేక రాయలసీమ, ప్రత్యేక ఉత్తరాంధ్ర, ప్రత్యేక గిరిజన రాష్ట్రం వంటి కోరికలు కూడా కమిటీ ముందు చర్చకు రావచ్చు. వాటిని గెలకడం అంటే కందిరీగల తుట్టెను కదిలించడం క్రిందే లెక్క. తెలంగాణ రాష్ట్ర వేర్పాటు ఉద్యమానికి 60 ఏళ్ల చరిత్ర వుంది. ఈ భావనలు ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినవి. తెలంగాణ ఉద్యమం వెనుక మూడు తరాల ప్రజల ఆకాంక్షలున్నాయి. వీటి వెనుక కొందరు నేతల పదవీ స్వార్థం మాత్రమే వుంది. ఈ రెండింటినీ ఒకే గాట కట్టి పరిశీలన జరిపించడం అంటే తెలంగాణ ఉద్యమాన్ని నీరస పరచడమే కాదు. అవమానించడం కూడా.

మొత్తానికి తెలంగాణ, సమైక్య ఆంధ్ర ఉద్యమాలతో రాష్ట్రం తగలబడి పోతుందన్న భయం నుంచి కొంత కాలం విరామం కల్గించాడు చిదంబరం. ఆయన పథకం ఎంత వరకు ఫలిస్తుందో, తెలంగాణ ఉద్యమకారులు ఆయన పన్నిన ఉచ్చులో ఎంతవరకు పడుతారో వేచి చూడాలి.

## కార్టూన్ స్కేప్




ఉద్యమాలతో 'అటకెక్కిన' అభివృద్ధిని దించే ప్రయత్నంలో వున్నారు!

శుభ ప్రారంభం

Ayush Super Specality Dental care
ఆయుష్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
జెబి కాంప్లెక్స్, వీఆర్‌సి సెంటర్ బ్రిడ్జి దగ్గర, రామలింగాపురం, నెల్లూరు. ఫోన్: 0861-2342866, 90521 54399

తేది 08-02-2010 సోమవారం ఉదయం
హాస్పిటల్ ప్రారంభకులు: శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారు
శాసన సభ్యులు, నెల్లూరు రూరల్.





జాతీయ, అంతర్జాతీయంగా
8 సంవత్సరాలు
విశేష అనుభవం గడించిన
దంత వైద్య నిపుణులు డాక్టర్ ఉమ్రాన్
M.D.S(AIPG) 2000 1st Rank From A.P
Ministry of Health, సౌదీ అరేబియా.
Residency Program, Canada 2007
డా॥ ఉమ్రాన్ MDS(AIPG)
గారిచే అత్యంత ఆధునిక దంతవైద్య పరికరాలతో
ఆధునిక వైద్యం "ఇప్పుడు నెల్లూరులో"

ప్రత్యేకతలు:
- రంగు మారిన లేదా గారపట్టిన పళ్లకు చికిత్స
- వంకర టింకర పళ్లను సరిచేయుట
- ఫిక్స్‌డ్ పళ్లు కట్టుట
- రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్
- దవడలకు సంబంధించిన సర్జరీలు
- చిగుళ్ల వ్యాధికి చికిత్స
- చిన్న పిల్లల దంత సమస్యలకు చికిత్స

మరియు పళ్లు పుచ్చకుండా Flourided Therapy

అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం


అర్ధాంతరంగా ఆగిన నెల్లూరులోని పెన్నా బ్యారేజ్ పనులు.

# నత్తనడకన... సాగునీటి పనులు!

**జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టుల పనులు చేపట్టను 800 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కాని ఈ పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లకు వీటిని ఇవ్వడం వల్ల అవి నత్తనడకన సాగుతున్నాయి.**

జిల్లాలో వ్యవసాయసాగును మరింత విస్తరించాలన్న లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగు నీరందించాలన్న సంకల్పం మాత్రం నెరవేరకుండా పోతుంది. కోట్ల రూపాయల కాంట్రాక్టు పనులు దక్కించుకున్న వివిధ కంపెనీలు ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా కృషి చేయడం లేదు. ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తికాక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

## పర్యవేక్షణ కొరవడింది!

అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, ప్రజాప్రతినిధుల వుదాసీనతగా వ్యవహరించడం వలన పనులు దక్కించుకున్న కంపెనీలు, సబ్ కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పెన్నాడెల్టా ఆధునీకరణ పనుల్లో భాగంగా కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధి చేయడంతోపాటు మూడు హెడ్ స్లూయిస్‌ల పునర్నిర్మాణం, ఈస్టన్, సదరన్ ఛానల్‌కు సంబంధించిన అభివృద్ధి పనులు, తూములు, రెగ్యులేటర్లు పునర్నిర్మించాల్సి వుంటుంది. సర్వేపల్లి కాల్వ, కృష్ణపట్నం కాల్వ, ఈదగాలి కాల్వ లైనింగ్ పనులతోపాటు కనిగిరి మెయిన్ కెనాల్, దువ్వూరు కాల్వ, దగదర్తి – రాచర్లపాడు లైనింగ్‌తోపాటు అల్లూరు ట్యాంక్ సప్లయ్ ఛానల్ లైనింగ్ పనులు చేపట్టాల్సి వుంటుంది.

గంగపట్నం, వరిగొండ కాల్వల లైనింగ్ పనులు చేపట్టడంతోపాటు 39 డెల్టా చెరువుల అభివృద్ధి చేయాలి. పై పనులతోపాటు మైనర్ బ్రాంచి కాల్వల ఆధునీకరణ పనులు ఒకే సమయాన పూర్తి చేయాలి. ఈదూరు, కోడూరు చెరువు మరమ్మతులు, కాల్వల లైనింగ్ పనులు పూర్తిచేసేందుకు రాష్ట్రప్రభుత్వం 5.85 కోట్లను కేటాయించగా కేవలం మూడు కిలో మీటర్ల వరకు పని చేసి కోటి రూపాయల ఖర్చు చేయడం జరిగింది. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ఈ సంవత్సరం ఆగస్టు వరకు గడువు పొడిగించారు. ప్యాకేజి నెం-33లో చేర్చిన సంగం బ్యారేజి నిర్మాణానికి 2008 సంవత్సరంలో 122.50 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది.

బ్యారేజి నిర్మాణ పనులను హార్విన్ కన్‌స్ట్రక్షన్స్, జెఎస్ఆర్ కంపెనీలు దక్కించుకొన్నాయి. కానీ నిర్మాణ పనులు మాత్రం ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. ఇప్పటివరకు కేవలం మూడు కోట్ల రూపాయల పనులు మాత్రమే పూర్తి చేయగలిగారు. సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో మరో సంవత్సరం గడువు పొడిగించారు. అలాగే ప్యాకేజి నెం-6లో వున్న నెల్లూరు బ్యారేజి నిర్మాణం కూడా నత్తనడక నడుస్తుంది. దీని నిర్మాణానికి 2008 సంవత్సరంలో 126.70 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. బ్యారేజి నిర్మాణ పనులను

కొరవ 14వ పేజీలో

### అగ్రిమెంట్లు రద్దు చేయాలి!



కోట్ల రూపాయల ప్యాకేజి పనులను పొందిన కంపెనీలు పనుల పూర్తి చేయకుండా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వీటి నిర్లక్ష్యం కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పనులు పూర్తి చేయించకుండా మరికొంత గడువును పొడిగించడం మంచి పద్ధతి కాదు. కాంట్రాక్ట్ కంపెనీలతో కుదుర్చుకున్న అగ్రిమెంట్లను రద్దు చేసి వేరే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలి.

*బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే.*

### తెలుగుగంగ కాల్వ పనులు పూర్తి చేయాలి!



గూడూరు డివిజన్‌లో తెలుగుగంగ ప్రాజెక్టు క్రింద చేపటిన్ట అనేక కాల్వల పనులు త్వరితగతిన పూర్తికాక రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పనులను పూర్తి చేసి రైతులకు సాగు నీరందించాల్సిన అవసరం వుంది. సాగునీటిని విడుదల చేస్తే అనేక మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయి. జలయజ్ఞం క్రింద కోట్లరూపాయలు జిల్లాకు కేటాయించనప్పటికి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

*బల్లి దుర్గాప్రసాదరావు, గూడూరు ఎమ్మెల్యే.*

### పనులు పూర్తి చేయిస్తాం!



జిల్లాలో జలయజ్ఞం క్రింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఒకసారి ఖరారు చేసిన టెండర్ ఏదైన కారణం చేత రద్దు చేసి తిరిగి టెండర్ పిలవాలంటే చాలా వ్యవధి పడుతుంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలిచ్చి పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం.

*కె.గణపతిరావు, ఎస్ఇ, ఇరిగేషన్.*



# ట్రాఫిక్‌కు తగ్గట్టుగాలేని గూడూరు రోడ్లు!

గూడూరు పట్టణంలో పెరిగిన ట్రాఫిక్‌కు తగినట్లు రహదారులు విస్తరించకపోవడం, రోడ్లు అధ్వాన్నంగా వుండడంతోపాటు మలుపులు కుదించుకొని పోతుండంతో ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో అధికభాగం ఈ మలుపుల వద్దే కావడం గమనార్హం. మలుపుల వద్ద కనీసపాటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. జానకిరామ్‌పేట, మాళవ్యనగర్, కోర్టుసెంటర్, జిఎస్‌రాయలు రైల్వేగేటు, శాంతినగర్ సెంటర్, అశోక్‌నగర్, బనిగిసాహెబ్‌పేట, రైల్వేస్టేషన్ సెంటర్, క్లాక్‌టవర్ సెంటర్, కుమ్మరవీధి, సంగం థియేటర్ల

## మలుపుల వద్ద ప్రమాదాలు

వద్ద ప్రమాదకర మలుపులు వున్నాయి. ఈ ప్రాంతంలో ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు, మలుపులను సూచించే బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా అస్పత్రిరోడ్డు, సొసైటీ సెంటర్, కరణాలవీధి, బాలాజీ నగర్, జనార్ధన్‌రెడ్డి కాలనీ, గాంధీబొమ్మల వద్ద నాలుగురోడ్ల కూడళ్లు వున్నాయి. ఇక్కడా ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకొంటున్నారు.



రైల్వేలో చీఫ్ టిక్కెట్ ఇన్స్‌పెక్టర్‌గా ప్రతిభావంతంగా పనిచేసిన నెల్లూరీయుడు బిరదవోలు వెంకురెడ్డిని వికాస్ ప్రజాహిత సేవాసమితి విశిష్ట పురస్కారంతో సన్మానిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, సిటీ ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు.

➪ స్వంత భవనాలు లేని

# వ్యవసాయశాఖ

## అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

జిల్లాలో లక్షల హెక్టార్లలో వరి పంట సాగవుతోంది. అధిక శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అలాంటి వ్యవసాయానికి సంబంధించిన వ్యవసాయశాఖకు సొంతభవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ విధులు సాగించాల్సి రావడం దురదృష్టకరం. వ్యవసాయ శాఖ పనులను పర్యవేక్షించేందుకు జిల్లావ్యాప్తంగా 12 సబ్ డివిజన్లు కొనసాగుతున్నాయి. ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో సహాయ సంచాలకులు విధులను పర్యవేక్షిస్తుంటారు. అంతటి ప్రాధాన్యత వున్న శాఖకు ఎక్కడా సొంత భవనాలు లేవు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయం సైతం అద్దె భవనంలోనే కొనసాగడం చెప్పుకోవలసిన అంశం. డివిజన్ కేంద్రమైన కావలిలో సహాయ సంచాలకుల కార్యాలయం సైతం అద్దె భవనంలోనే వుంది. ఈ రెండు ప్రాంతాల్లో రెండేళ్లుగా భవనాల అద్దె చెల్లించలేకపోవడంతో అద్దె చెల్లించాలని నోటీసులు అధికారులకు అందినట్లు సమాచారం. ఆత్మకూరు, వెంకటగిరిలలో ఏడిఏ కార్యాలయాలు ఆ శాఖ గోడౌన్లలో కొనసాగుతున్నాయి. పొదలకూరులో జిల్లా పరిషత్‌కు చెందిన ఒక గదిలో ఏడిఏ కార్యాలయం వుంది. ఉదయగిరి, ఇందుకూరుపేటలలో మండల వ్యవసాయశాఖ కార్యాలయాలనే సబ్‌డివిజన్ కార్యాలయాలుగా వినియోగించుకొంటున్నారు. అంతటి ప్రాధాన్యత గల ఈ శాఖకు సొంతభవనాలు లేకపోవడం నిజంగా సిగ్గుపడాల్సిన విషయం.




పొదలకూరులో జరిగిన 90వ గ్రిగ్ పోటీల ముగింపు ఉత్సవంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి. ప్రక్కన జడ్పీ ఉపాధ్యక్షుడు టివిఎస్.రాజా తదితరులు.

● ఆత్మకూరు

# గబ్బు గబ్బు!

ఆత్మకూరు పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎక్కడ చూసినా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడం, పందుల సంచారం అధికం కావడంతో పట్టణవాసులు పలు రకాల వ్యాధులతో సహజీవనం చేయాల్సి వస్తోంది. రామాలయం వీధిలో హోటళ్ల వద్ద నుంచి వస్తున్న వ్యర్థ ప్రదార్థాలు, మురికినీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు అవస్థలు పడుతు

## క్షీణించిన పారిశుధ్యం

న్నారు. అడుగుతీసి అడుగు ముందుకు వేయాలంటే అన్నీ అగచాట్లే. విపరీతమైన దుర్వాసన వస్తుండడంతో పాదచారులు, వాహనచోదకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద అధికం కావడంతో ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు చికున్‌గున్యా, విషజ్వరాల బారినపడుతున్నారు. ఇంతగా పారిశుధ్యం క్షీణించినా అటు పాలకులు గాని, ఇటు అధికారులు గాని స్పందించక పోవడం ప్రజల ఆరోగ్యం పట్ల వారికున్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నది.

● కయ్యూరు చెరువును

# మినీ రిజర్వాయర్ చేయండి!

బాలాయపల్లి మండలంలో వున్న కయ్యూరు చెరువును మినీరిజర్వాయర్‌గా చేసి రెండవ పంటకు సాగునీరు అందించాలంటున్నారు రైతులు. జిల్లాలో పెద్ద చెరువుల్లో ఒకటైన ఈ చెరువు నుంచి కయ్యూరు, అక్కసముద్రం, వెంగమాంబపురం, యాచవరం, బాలాయపల్లి తదితర గ్రామాల్లోని 3500 ఎకరాలకు సాగునీరు పారుదల అవుతోంది. ఈ చెరువు నిండాలంటే ఊట్లపల్లి, పిగిలాం, సంగవరం, గొల్లగుంట గ్రామాల్లోపడే వర్షపు నీరు చెరువుకు చేరాలి. కైవల్యానది నుంచి బంగారుపేట వద్ద నీటిని మళ్లింపు చేస్తారు. గత ఏడాది డిసెంబర్‌లో ప్రత్యేకంగా కయ్యూరు కాలువకు నీటిని మళ్లించేందుకు తెలుగుగంగ కాలువ నుంచి సప్లైగేటు ఏర్పాటు చేశారు. ఈ చెరువును నింపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం కయ్యూరు చెరువును మినీరిజర్వాయర్‌గా చేసినట్లయితే రెండవ పంటకు సాగునీరు అందడంతోపాటు, వాణిజ్య పంటలైన నిమ్మ, చెరకు, వేరుశనగకు పంటల వృద్ధికి దోహదకారి అవుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

## మత్స్య క్షేత్రం

వెంకటాచలం మండలం ఎగువమిట్ట గ్రామంలో 1.30 కోట్ల రూపాయలు వెచ్చించి ఇన్‌స్ట్రక్షనల్ ఫ్రెష్ వాటర్ ఫిష్ పాండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముత్తుకూరు మత్స్య కళాశాల వర్గాలు చెప్పాయి. ఏడాది కాలవ్యవధిలో 47 ఎకరాల విస్తీర్ణంలో ఇది రూపుదిద్దుకొంటుంది. బ్రిటీష్ కాలం నాడే ఎగువమిట్ట మత్స్యకేంద్రంగా గుర్తింపు పొందింది. కానీ అభివృద్ధికి నోచుకోలేదు. మత్స్యకళాశాల ముత్తుకూరులో పెట్టిన తర్వాత వారి పరిశోధనకు ఒక మత్స్య క్షేత్రం అవసరమై పాత ఎగువమిట్టనే మళ్లీ ఎంపిక చేశారు. జిల్లాలో మత్స్య పరిశ్రమాభివృద్ధికి ఈ క్షేత్రం ఎంతగానో దోహదపడుతుంది.



నెల్లూరు నగర బిజెపి అధ్యక్షుడుగా ఎన్నికైన వెంపులూరు భాస్కర్‌గౌడ్‌ను అభినందిస్తున్న అభిమానులు.



కలువాయి మండలంలో ప్రజాభిమానం పొందిన హాస్టల్ వార్డన్ నరసింహారెడ్డికి రిపబ్లిక్‌డే వుత్సవంలో ఉత్తమసేవా పురస్కారాన్ని అందిస్తున్న కలెక్టర్ రాంగోపాల్. ప్రక్కన ఎస్పీ మల్లారెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ డిడి నాగలక్ష్మి.




నెల్లూరు జడ్పీ మీటింగ్ హాలులో జరిగిన ఎపియుడబ్ల్యుజెఎఫ్ డైరీ ఆవిష్కరణలో ఎస్పీ మల్లారెడ్డి, యూనియన్ నాయకుడు మధు, కలెక్టర్ రాంగోపాల్.

# ఫోన్ చేస్తే స్పందిస్తా!

**వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

ఒక్క ఫోన్ చేస్తే తక్షణం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ ప్రకటించారు. కలువాయి మండలంలో పర్యటించిన ఆయన ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా అధికారులపై వచ్చిన ఫిర్యాదులకు ఆయన స్పందిస్తూ మండలంలో తెలుగుదేశం పార్టీకి సమర్థుడైన నాయకుడు లేనందున అధికారులు కాంగ్రెస్ పార్టీ వారికి పనులు చేసి పెడుతున్నారని వ్యాఖ్యానించారు. అధికారులు ఇప్పటికైనా తీరు మార్చుకొని పేదల కోసం పనిచేయాలని లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు చేపడతామన్నారు. కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. తన సెల్‌ఫోన్ నెంబర్ 99480 68888కు ఫోన్ చేస్తే చాలంటూ శివమణి సినిమాలో నాగార్జున స్టైల్లో చెప్పడంతో కొందరు ఆ నెంబరును వ్రాసుకున్నారు.

# బూడిదతో ఇబ్బందులు!

**• పట్టించుకోని ఇటుక తయారీదారులు**

కొడవలూరు మండల పరిధిలో ఫ్లైయాష్ తయారీ వలన ప్రజలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. రహదారి వెంబడి ఫ్లైయాష్ ఇటుకల తయారీకి వినియోగించే బూడిదను నిల్వ చేస్తుండడంతో ప్రయాణీకులకు తీవ్ర విఘాతం కల్గుతున్నది. ఈ ఫ్లైయాష్ గాలికి రేగి వాహనచోదకుల కళ్లల్లో పడుతుండడంతో పలువురు సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాహనాలు నడిపే సమయంలో ఈ బూడిద వచ్చి కళ్లలో పడుతుండడంతో ప్రమాదాలకు గురౌతున్నారు. నార్తు రాజుపాళెం సమీపంలో వున్న ఈ యాష్ గుట్టల కారణంగా పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు వున్నాయి. ఇటుకల తయారీదారులు ఫ్లైయాష్ గాలికి రేగకుండా వుండేందుకు పట్టలు కప్పాల్సి వుంది. అలాంటి రక్షణచర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణీకులతోపాటు, చుట్టు ప్రక్కల నివాసం వుండే వారికి కష్టాలు తప్పడం లేదు.

# గూడూరులో దొంగనోట్ల చలామణి!

**• స్థానికులు మారుస్తున్నట్లుంది!**

పరిశ్రమలు, పోర్టు ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగాలు, భూముల ధరలకు రెక్కలు రావడం ఎలా వున్నా రైతులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. రిలయన్సు ప్రాజెక్టుకు సంబంధించి రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం ఇంత వరకు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. షుమారు 300 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. వారిలో ఎవరికి ఇంత వరకు ఒక్క రూపాయి అందిన దాఖలాలులేవు. అయ్యవీరప్ప కండ్రిగ, శంభునితోపు తదితర గ్రామాల్లోని రైతులు పరిహారం కోసం సంస్థ చుట్టు, అధికారుల చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నా ఇంతవరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతం. అధికారులను అడిగితే రిలయన్సు కంపెనీ నిర్వాహకులను అడగమని చెప్తున్నారని, వారిని అడిగితే మాకు సంబంధం లేదు రెవెన్యూ అధికారులను అడగండని చెప్తున్నారని పరిహారం అందని రైతులు వాపోతున్నారు.

**• సోమశిల**

# కాలువలు నిరుపయోగం

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో రైతుల ప్రయోజనార్థం నిర్మించిన 12ఆర్ సబ్‌మైనర్ కాలువ నిరుపయోగంగా మారడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజెప్తున్నది. సోమశిల జలాశయం పరిధిలోని ఈ కాలువను షుమారు మూడేళ్ల క్రిందట 25లక్షల రూపాయలతో నిర్మించారు. అంత మొత్తం వెచ్చించి కాలువ కట్టినా అధికారుల్లో ముందుచూపు కొరవడడంతో ప్రజాధనం వృధా కావడం తప్ప ప్రయోజనం శూన్యం. అనంతసాగరం మండలంలోని 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు దీనిని నిర్మించినా ఇప్పటివరకు ఒక్క చుక్కనీరు ఆ కాలువ గుండా ప్రవహించిన దాఖలాలు లేవు. రైతులకు ఎలాంటి మేలు చేకూర్చకపోయినా కాంట్రాక్టర్లకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తోంది. నిర్మాణ సమయంలోనే సబ్‌మైనర్ టబ్‌వాల్ కుంగిపోయింది. అయినా అధికారులు ఈ విషయాన్ని బయటకు రానీయక గుట్టుగా వుంచి కాంట్రాక్టర్‌కు బిల్లులు చేసిపెట్టారు. దీనికి అధికారులకు పెద్ద మొత్తంలో కమీషన్ ముట్టిందట. 20లక్షలతో ఉపకాలువ నిర్మించినా కాలువ లెవల్ పొలాలకు నీరందించేదిగా లేదు. రైతులు ఆందోళన చేయడంతో 5నెలల క్రిందట జిల్లాకలెక్టర్ నిధుల నుంచి 1.5లక్షలతో సబ్ మైనర్ కాలువకు మరమ్మత్తులు చేపట్టారు. తర్వాత అధికారులు నీరు విడుదల చేస్తే బ్రిడ్జి వరకు వచ్చి ప్రక్కదారి పట్టాయి. దీంతో ఈ ఏడాది కూడా ఆయకట్టు రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.

**ప్రజాధనం నీటిపాలు**

# నెల్‌కాస్ట్‌కు పాతికేళ్లు!

**• గూడూరులో ఘనంగా ఉత్సవాలు**

గూడూరులో ఏర్పాటు చేసిన నెల్‌కాస్ట్ పరిశ్రమ 25 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా వార్షికోత్సవం సంస్థ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ పొన్నవోలు రాధాకృష్ణారెడ్డి పరిశ్రమ ఏర్పాటు, అభివృద్ధి గురించి వివరించారు. 1985లో స్థాపించిన ఈ పరిశ్రమ నెలకు 50టన్నుల సామర్థ్యంతో ప్రారంభమై సంవత్సరానికి 1,50,000 టన్నులకు పెరిగి దేశంలోనే అతిపెద్ద ఐరన్ పరిశ్రమగా అభివృద్ధి సాధించిందన్నారు. గూడూరులో మైకాపరిశ్రమ తగ్గుముఖం పట్టిన తర్వాత నెల్‌కాస్ట్ ద్వారా వేలాది మందికి ఉపాధి లభించిందన్నారు. గత 25 సంవత్సరాలుగా నిర్విరామంగా పనిచేస్తూ ఉత్పత్తి సాధించడం సంస్థ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. అశోక్‌లైలాండ్, టఫే, టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్, మహేంద్ర తదితర కంపెనీలకు సప్లయర్‌గా వుందన్నారు. తమ సంస్థ ఉత్పత్తులు అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా దేశాలకు ఎగుమతి అవుతున్నాయన్న విషయాన్ని వివరించారు. అనంతరం ఉద్యోగులకు సర్వీసుల అవార్డులు అందజేయడంతోపాటు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.


# పంచమ వర్ధంతి



శ్రీమతి నాయుడు నిర్మల గారు

మంచికి మారు పేరుగా నిలిచి,
అందరికీ ఆప్యాయతానురాగాలు పంచి పెట్టిన
శ్రీమతి నాయుడు నిర్మల గారు
స్వర్గస్తులై 07-02-2010 తేది నాటికి ఐదు సంవత్సరములు
నిండుతున్న సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు చిరశాంతిని
ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

భర్త

నాయుడు వెంకట నరసారెడ్డి
(నెల్లూరు)

కుమార్తెలు - అల్లుళ్లు

బాలిరెడ్డి పవిత్ర - డా॥ దుర్గాప్రసాద్‌రెడ్డి, M.Ch.
కాటంరెడ్డి హేమ - వివేకానందరెడ్డి, M.C.A

మనుమరాలు - మనుమడు

మోక్షదశ్రీ - సుబ్బరామిరెడ్డి
విదుర్‌రెడ్డి

# దామరమడుగులో అభివృద్ధి ఫలాలు!

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామర మడుగు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్ట డంలో పంచాయితీ పాలకవర్గం విశేషంగా కృషి చేస్తున్నది. గ్రామ పంచాయితీ పరిధిలో చేపట్టాల్సిన పనులను ముందుగా గుర్తించి ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నారు. త్రాగునీటి సమస్య, వీధిలైట్లు, పారిశుధ్యం తదితర సమ స్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుం టున్నారు. దామరమడుగు గ్రామంలో ఒకటి రెండు వీధులు తప్ప ప్రధాన వీధులన్నీ సిమెంటు రోడ్లుగా మారిపోయాయి. మిగిలిన వీధులలో కూడా సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ గ్రామ పంచా యితీకి చెందిన ప్రజలు అభివృద్ధి పనుల విష యంలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దామరమడుగు గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా సిపిఎంకు చెందిన గండవరపు శ్రీని వాసులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సిపిఎం పార్టీకి కంచుకోటగా పిలవబడే ఈ గ్రామం నుంచి గత పంచాయితీ ఎన్నికల్లోనూ సిపిఎంకు చెందినవారే సర్పంచ్‌గా గెలుపొందారు. 14 వార్డులు కలిగిన ఈ పంచాయితీ పరిధిలో 1600 కుటుంబాలు, పదివేల జనాభా, ఆరు వేల మంది ఓటర్లు వున్నారు. ప్రభుత్వం నుంచి ఎస్ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు లక్షా 50వేల రూపాయులు విడుదలవుతుండగా, వివిధ పన్నుల రూపంలో లక్షా 50వేల రూపా యులు వసూలు చేస్తుంటారు. ఈ నిధులతోనే పంచాయితీ పరిధిలోని కాలనీలలో అంచలం చెలుగా వివిధ పనులు చేస్తున్నారు. పంచా యితీ పరిధిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తారని గ్రామస్తులు చెప్పారు.

ఈ పంచాయితీ పరిధిలో పల్లెపాళెం, రామచంద్రారెడ్డి నగర్, రెండు దళిత కాలనీలు వున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధులలో సిమెంటు రోడ్లు నిర్మించడంతోపాటు డ్రైనేజి కాల్వలను సైతం ఏర్పాటుచేయడం జరిగింది. మురికినీరు వీధులలో చేరకుండా అన్ని చర్యలు తీసుకున్నారని స్థానికులు చెప్పారు. విద్యుత్ కోత లేకుంటే నిత్యం త్రాగునీరు సరఫరా చేస్తారన్నారు. వీధిలైట్లు ఏ వీధిలో వెలగకపో యినా వెంటనే సిబ్బంది బల్బులను ఏర్పాటు చేస్తారని ప్రజలు చెప్పారు. గ్రామ పంచాయితీ పరిధిలో అభివృద్ధి ఎలా వుందని గ్రామంలోని వారిని పలకరిస్తే తమకెటువంటి సమస్యలు లేవని అంటున్నారు. ఇతర గ్రామ పంచాయి తీలకంటే తమ పంచాయితీ అభివృద్ధి పనుల విషయంలో ఆదర్శంగా నిలుస్తుందన్న అభి ప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



### త్రాగునీటి సరఫరా బాగుంది!

మా పంచాయితీ పరిధిలోని అన్ని కాలనీ లకు త్రాగునీటి సరఫరా బాగుంది. అలాగే మురికి నీరు కూడా వీధులలోకి చేరకుండా చేయ డంతోపాటు దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకొంటున్నారు. గ్రామంలో ప్రధాన వీధులన్నీ సిమెంటు రోడ్లుగా మార్చ డం అభినందనీయం.

– సుగుణమ్మ



### వెంటనే స్పందిస్తారు!

మా పంచాయితీ పరిధిలో ఏ సమస్య తలె త్తినా సర్పంచ్, అధికా రులు వెంటనే స్పందిస్తారు. మిగిలిన పంచా యితీలతో పోల్చుకుంటే దామరమడుగు పంచాయితీని అభివృద్ధి పనుల విషయంలో ఆదర్శమని చెప్పవచ్చు. అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో పాలకవర్గం చేస్తున్న కృషిని అందరూ అభినందించాలి.

– కె.శేషయ్య



గ్రామంలో ప్రతి రోడ్డూ సిమెంటు రోడ్డే.



త్రాగునీటి సమస్యను తీర్చిన సురక్షిత మంచినీటి పథకం.

అవినీతి కథ

# పనికిమాలిన పనులకు నిధులు కేటాయిస్తున్న మేయర్

**నెల్లూరు కార్పొరేషన్ మేయర్ భానుశ్రీ ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయకుండా, తనకు కమిషన్లు వచ్చే పనులకే కోట్లాది రూపాయలు జంకు గొంకు లేకుండా కేటాయించడం విమర్శలకు దారితీస్తోంది.**



నిధుల కేటాయింపులో విమర్శలెదుర్కొంటున్న మేయర్.

అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లు... మునిసిపల్ కార్పొరేషన్ నిధుల్ని మేయర్ ఇష్టానుసారంగా కేటాయింపులు జరుపుతున్నారు. అత్యవసర పనులకు మంజూరు చేయాల్సిన నిధు లను అవసరం లేని చోట కేటాయింపులు జరుపుతూ విమర్శల పాలవుతున్నారు. మునిసిపల్ నిబంధనల ప్రకారం స్టాండింగ్ కమిటీ ఆమోదం మేరకు నిధుల కేటాయింపు జరగాలి. అయితే నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో దీనికి భిన్నంగా జరుగుతుంది. స్టాం డింగ్ కమిటీలోని సభ్యులు ఎంత మొత్తుకుంటున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. నా ఇష్టం వచ్చిన విధంగా నిధులు కేటాయించాను? ఏం చేసు కుంటారు? అన్న ధోరణిలో మేయర్ వ్యవహరిస్తుంది.

ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రజలకు నష్టాలు సంభవిస్తే అటువంటి పనులు చేసేందుకు ముందస్తు నిధుల మంజూరుకు అనుమతిలివ్వ వచ్చు. అయితే ఇక్కడ నగర మేయర్ భానుశ్రీ షాపింగ్ కాంప్లెక్సులు, సిమెంటు రోడ్ల నిర్మాణాలకు ముందస్తు అనుమతి ఇవ్వడం అనేక అనుమానా లకు దారి తీస్తుంది. కేటాయించిన నిధులు ఎమ్మెల్యే, ఎమ్పీ ప్రభుత్వ గ్రాంట్ల నుంచి కాకుండా కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి కేటాయించే విధంగా వ్యవహ రించారు. నెల్లూరు నగరంలోని పలు డివిజన్లలో పారిశుధ్యం లోపించడం కారణంగా నగర ప్రజలు జ్వరాల బారినపడి అనారోగ్యం పాలవుతున్నారు. దీన్ని మెరుగుపర్చేందుకు అవసరమైన సిబ్బంది, పారిశుధ్యం విషయమై అత్యవసర పనుల నిమిత్తం మేయర్ నిధులు కేటాయించవచ్చు.

అలాగే త్రాగునీటి సరఫరా విభాగంలో మోటార్ల మరమ్మత్తులకు గుర్తై త్రాగునీటి సరఫ రాకు అంతరాయం కలుగుతుంది. ఇటువంటి పను లకు మాత్రం నిధులు కేటాయించకుండా కేవలం కాంట్రాక్టర్లు చేపట్టే పనులకే స్టాండింగ్ కమిటి ఆమోదం లేకుండా నిధులు కేటాయించడం విరుద్ధ మని చెప్పవచ్చు. ఇదిలా వుండగా నగరంలోని పలు డివిజన్లలో చెత్తను రవాణా చేసేందుకు 14 హైడ్రా లిక్ ఆటోలను కొనుగోలు చేసేందుకు ఆహ్వానిం చిన టెండర్లలో కూడా భారీస్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. కంపెనీ రేట్ల కంటే అధికంగా రేట్లను వేసిన టెండర్‌ను ఖరారు చేశారు. వాస్తవంగా హైడ్రాలిక్ ఆటో ఒకటి 2 లక్షల 40వేలు ధర పలుకు తుంది. మేయర్, కమిషనర్‌లు ఒక్కో ఆటోను 3లక్ష లకుపైగావెచ్చించి కొనుగోలు చేసేందుకు నిర్ణయించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అలాగే మరో 14 మినీట్రక్కులు, ఒక బుల్డోజర్ ఇతర పరిక రాలు, సామగ్రిని కొనుగోలు చేసేందుకు దాదాపు కోటి 20లక్షలకు పైగా ముందస్తు అనుమతులు ఇవ్వడం జరిగింది. ఇవే కాకుండా మరో 2కోట్లకు పైగా కాంట్రాక్టు పనులకు స్టాండింగ్ కమిటీ ఆమో దం లేకుండానే మేయర్ స్వంత నిర్ణయాలు తీసు కొని అనుమతించారు. గత నెల 25వ తేదిన కార్పొ రేషన్ సమావేశమందిరంలో నిర్వహించిన స్టాం డింగ్ కమిటీలో సభ్యులడిగిన ప్రశ్నలకు మేయర్, కమిషనర్ సమాధానాలు చెప్పలేకపోయారు.

కేవలం కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చా లన్న వుద్దేశంతోనే కోట్లరూపాయల పనులు, యం త్రాల కొనుగోలుకు ముందస్తు అనుమతిచ్చారని సభ్యులు మేయర్ భానుశ్రీని నిలదీయడం జరిగింది. ప్రజలకు అవసరమైన ఒక్క పనికి కూడా నిధులు కేటాయించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. స్టాం డింగ్ కమిటీ సమావేశంలో మేయర్ వ్యవహరించిన తీరు అందరికీ విస్మయం కలిగించింది. నిబంధనల ప్రకారం సమావేశాలు నిర్వహించకపోవడం, నిధుల కేటాయింపులో ఇష్టానుసారంగా వ్యవహరించడాన్ని చూస్తే తనను ఎవరు ఏం చేయలేరన్న ధీమా వ్యక్త మయ్యింది. పాత మేయర్ పులిమిశైలజను నిబంధ నలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఒక్క కారణం తోనే ప్రభుత్వం మేయర్ పదవి నుంచి తప్పించిన విషయాన్ని సభ్యులు గుర్తు చేశారు. అదే దారిలో ప్రస్తుత మేయర్ భానుశ్రీ పయనిస్తుందన్న విష యాన్ని గుర్తు చేసినప్పటికి ఆమె ఎవరిని లెక్కచేయ డం లేదు. ఆనం సోదరులు తనకు అండగా వున్నంతకాలం ఏం చేసినా చెల్లుబాటవుతుందన్న ధైర్యం మేయర్‌లో వుంది. ఏది ఏమైనా స్టాండింగ్ కమిటీకి ప్రాధాన్యత లేకుండా అన్ని అనుమతులు ఇచ్చేసిన తర్వాత కమిటి సమావేశం ఎందుకు నిర్వ హిస్తున్నారన్న విషయమై స్పష్టత లేదు.

## నాగచైతన్య మూడో చిత్రం!



నటుడు నాగార్జున కుమారుడు నాగచైతన్య 'జోష్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈ చిత్రం పెద్దగా ఆడకపోయినా నాగచైతన్యకు మంచి గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం ఆయన నటిస్తున్న ద్వితీయ చిత్రం షూటింగ్ పూర్తయ్యింది. అంతలోనే మూడవ చిత్రానికి రంగం సిద్ధమయ్యింది. నెల్లూరీయుడు కామాక్షి కళామూవీస్ నిర్వాహకుడు డి.శివప్రసాద్ రెడ్డి ఈ చిత్రాన్ని తీస్తున్నారు. అజయ్ భూయాన్ దర్శకుడు. ఇందులో హీరోయిన్‌గా కాజల్ నటిస్తోంది.

## గాయనిగా ముమైత్!



ఐటెం పాటలతో ఇన్నాళ్లు రసిక ప్రేక్షకులను అలరించిన నృత్య తార ముమైత్‌ఖాన్ మరో కొత్త అవతారం ఎత్తింది. ఈమెలో గాయని దాగున్న విషయం గుర్తించిన ఈమె గురువు, దర్శకుడు పూరిజగన్నాథ్ గోలీమార్ చిత్రంలో ఓ పాట పాడించారు. ఈ పాటకు చక్రి సంగీత దర్శకుడు. అయితే ఈ పాటను గోపిచంద్, ప్రియమణిలపై చిత్రీకరించారు. ఈ పాట క్లిక్ అయితే ముమైత్‌కు మరిన్ని పాటలు పాడే అవకాశాలు రావచ్చు.

## పొడవాటి జుట్టు కావాలి!



జుట్టున్నమ్మ ఏ కొప్పైనా పెట్టుకోవచ్చన్న వైనం హీరోయిన్ నమితకు ఇప్పుడు తెలిసొచ్చినట్లుంది. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ దేవుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటే పొడవాటి జుట్టును అడుగుతానంది. భగవంతుడు నాకు మంచి మేనిఛాయనిచ్చాడు. ముక్కు ముఖం తీరుగా వుంటుంది. నటనా ప్రతిభ కూడా వుంది. జుట్టు మాత్రం ఒత్తుగా వుండదు. ఇంట్లో అబ్బాయిల మధ్య పెరిగాను. అప్పుడు జుట్టు గూర్చి పట్టించుకోలేదు. కొన్ని సినిమాల్లో నిండైన చీరకట్టుతో పొడవాటి జుట్టున్నట్లు నటించినప్పటి నుంచి జుట్టు పెంచాలన్న కోరిక ఎక్కువయ్యింది.



తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు ఓ హిందీ చిత్రంలోనూ హీరోయిన్‌గా ప్రియమణి నటిస్తుంది. కొత్త చిత్రం 'గోలీమార్' సినిమా షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడింది. పరుత్తివీరన్ చిత్రంలో లంగా ఓణీలో నటించి జాతీయ అవార్డు సాధించాను. ఆ తర్వాత సినిమాల్లో కాస్త బోల్డ్‌గా నటించాను. బికినీ

## ముద్దులిస్తాను!

వేసుకోవాలని నేను ముందేమీ అనుకోలేదు. కథాపరంగా సరిపోతుందని ఒప్పుకున్నా. ముద్దు సన్నివేశాల విషయం కూడా అంతే. నేను వీటికి వ్యతిరేకిని కాను. తప్పని పరిస్థితులు వస్తే ముద్దులు పెడతానని ధైర్యంగా చెప్పింది ప్రియమణి.

## లంగా ఓణి అంటే ఇష్టం!



మోడ్రన్ దుస్తుల్లో ఎంతందంగా కనిపించినా లంగా ఓణీ వేసుకొంటే ఆ ముచ్చటే వేరంటుంది హీరోయిన్ నయనతార. ఈ విషయమై వివరిస్తూ 'అదుర్స్' చిత్రంలో చంద్రలేఖ పాత్ర పోషణలో భాగంగా లంగా ఓణీ వేశాను. చాలామంది అభినందిస్తూ ఫోన్లు చేశారు. తమిళ్‌లో 'యారడీ నీ మోగినీ' చిత్రంలో లంగా ఓణీ వేశాను. మంచి స్పందన వచ్చింది. ఎన్ని మోడ్రన్ డ్రస్సులున్నా సాంప్రదాయ బట్టల ముందు దిగదుడుపే. మా అన్నయ్య దుబాయ్‌లో వుంటాడు. అక్కడికి వెళ్లినప్పుడు మోడ్రన్, సాంప్రదాయ దుస్తులను డిజైన్ చేయించుకొంటానంది నయనతార.

## సీతారాముల కళ్యాణం లంకలో గందరగోళం!



✍ అల్లూరు రహీం

వరుసగా 12 ఫ్లాపుల తర్వాత 13వ చిత్రంగా విడుదలైన సీతారాముల కళ్యాణం... లంకలో కూడా హీరో నితిన్‌కు స్వాంతన చేకూర్చలేదు. ఇది ఆయన పాత చిత్రాల బాటనే నడిచింది. ఈ చిత్రకథలో కొత్తదనం లేదు. గుడుంబా శంకర్, రెఢీ' సినిమాల్లోని కొన్ని సన్నివేశాలను అటుఇటుగా మార్చి కామెడీ ట్రాక్‌లో వాడేసారు. కొత్త దర్శకుడు ఈశ్వర్ చేతికి నవరసాలు పండించాల్సిన కథ ఇచ్చినా దాన్ని ఆయన జనరంజకం చేయలేకపోయాడు. కాలేజిలో కాసింత ఘాటు లవ్ సీన్లు పండించిన ఆయన మిగతా చిత్రమంతా కామెడీ ట్రాక్ పైనే ఆధారపడిపోయాడు. సగానికి పైగా నడిపిన రాయలసీమ ఫ్యాక్షనిజంలో కొత్తదనం చూపలేకపోయాడు. హీరోయిన్ అందాల బొమ్మ హన్సికను సైతం వెండితెరపై మిలమిల మెరిపించడంలో విఫలమయ్యాడు. కిస్‌మి – చరణంతో సాగే పాట మినహా మరో పాటను ప్రతిభావంతంగా తీయలేకపోయాడు. కామెడీ ఆధారంగా నడిచిన ఈ చిత్రంలో హీరో నితిన్ హాస్యరసం పండించలేకపోయాడు. బ్రహ్మానందం, అలీ, పలు చిత్రాల్లో విలన్‌గా కనపడే సుబ్బరాజుల కాంబినేషన్‌లో నడిచే కామెడీట్రాక్ పైనే ఇంటర్వెల్ నుంచి ఈ చిత్రం ఆధారపడిందనడం నిజం. ప్రథమార్థంలో ఎం.ఎస్.నారాయణ, చంద్రమోహన్, కళ్లు చిదంబరం కామెడీట్రాక్ భారం మోశారు. శాసన సభ్యుడు డాక్టర్ విజయప్రసాద్ ఈ చిత్రానికి నిర్మాత కావడం వల్ల దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ చిత్రం ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టారు. దీన్ని సైతం నిర్మాత చిత్ర ప్రారంభంలో వాడుకొన్నాడు. కొత్త మాటల రచయితలు తోటా ప్రసాద్, దీపక్‌రాజ్ వ్రాసిన డైలాగుల్లో లవ్వంటే రిస్క్, మనసుకు నచ్చిన అమ్మాయి మిస్ అయితే లైఫ్‌లో అన్ని మిస్సయినట్లే. ప్రేమున్న చోట భయముండదు. అదృష్టవంతుడ్ని ఎవరూ చెడగొట్టలేరు... ఆలోచింపజేస్తాయి. అనూప్ రూబెన్స్ సంగీతంలో ప్రత్యేకత కానరాలేదు. మల్హర్‌భట్ జోషి కెమెరా పనితనం చిత్రంలోని కొన్ని సన్నివేశాల్లో ప్రస్ఫుటమయ్యింది.

ఇక చిత్రకథలోనికి వెళ్తే ఒకే కాలేజీలో చదువుకొనే చందు (నితిన్), నందిని (హన్సిక)ల మధ్య కొన్ని సంఘర్షణల అనంతరం ప్రేమ పుడుతుంది. నందిని రాయలసీమలో ఫ్యాక్షనిస్ట్ పెద్దిరెడ్డి (సుమన్) కుమార్తె. ఈమెను ఒక ఫంక్షన్‌లో చూసిన ఆళ్లగడ్డ ఫ్యాక్షనిస్ట్ వీరప్రతాప్ (పాండా) మనసు పారేసుకొంటాడు. తన పెదనాన్న (జయప్రకాష్ రెడ్డి)ని పెళ్లి సంబంధం మాట్లాడిరమ్మని పెద్దిరెడ్డి వద్దకు పంపుతాడు. కాని ఈ పెళ్లికి ఆయన ఒప్పుకోడు. వేరే సంబంధం చేయాలని ప్రయత్నిస్తుండగా చందు పెద్దిరెడ్డిని కలసి నందిని, తాను ప్రేమించుకున్న విషయం చెబుతాడు. ఫ్యాక్షనిస్ట్ కూతుర్ని చేసుకోవాలంటే వుండాల్సిన అర్హతలను పెద్దిరెడ్డి చందుకు వివరిస్తాడు. తనతో పెళ్లి సంబంధం కుదుర్చుకోనందుకు నందినిని వీరప్రతాప్ చెరబడతాడు. అడ్డుపడిన పెద్దిరెడ్డిని తీవ్రంగా గాయపరుస్తాడు. ఈ సమయంలో తన అసహాయతను చందు ముందు పెద్దిరెడ్డి వ్యక్తం చేయడంతో అతను ఆళ్లగడ్డకు బయలు దేరుతాడు. వీరప్రతాప్ లంకలో ప్రవేశం కోసం అప్పలరాజు (బ్రహ్మానందం)ను చందు వాడుకొంటాడు.

చిత్ర సమీక్ష

అక్కడ నుంచి కథ గుడుంబా శంకర్ తరహాలో నడుస్తుంది. వీరప్రతాప్‌ను చందు వెర్రి వాడిని చేసి ఆడిస్తాడు. దీనికి అప్పలరాజు, బుజ్జిగాడు (సుబ్బరాజు), ముత్తయ్య (అలీ) సహకరిస్తారు. చివరలో హీరో రావణ సంహారం చేసి తన సీతకు ఫ్యాక్షనిస్టుల లంకలోనే తాళి కట్టడంతో చిత్రం ముగుస్తుంది. చిత్రాల సంఖ్య పెరుగుతున్నా హీరో నితిన్ డైలాగ్ డెలివరీ ఇంకా మెరుగుపడలేదు. హీరోయిన్ హన్సిక హావభావాలు కొన్ని సన్నివేశాల్లో అయోమయంగా వున్నాయి. బహుశా భాష, భావం తెలియని స్థితిలో ఈ పరిస్థితి వుత్పన్నమయ్యిందనాలి. కథకుడు, దర్శకుడు కొత్తవాళ్లు కావడం వల్ల సీతారాముల కళ్యాణం లంకలో చిత్రాన్ని గందరగోళంగా తయారు చేశారు.

## జిప ఛైర్మన్

9వ పేజీ కొరవ

స్తారు. స్టే తెస్తారు. కొన్ని నెలలపాటు అది అమలులో వుంటుంది. వున్నట్లుండి ఆ కేసు ఉపసంహరిస్తారు. ఆ వెంటనే మరొకరి చేత మరొక కేసు వేయించి మళ్లీ స్టే తెస్తారు. న్యాయస్థానాలను అడ్డం పెట్టుకొని ఆటలాడుకోవడం వీరికొక అలవాటుగా మారింది. కోర్టుల ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని నివారించడానికి జిప ఛైర్మన్ నేరుగా రంగంలోకి దిగారు. ఒక కేసులో తాను కూడా ప్రతివాదిగా చేరాడు. కొద్దిరోజులలోనే ఆ కేసు ఉపసంహరించి వేశారు. దానితో పెండింగ్‌లో వున్న మరొక కేసులో భాగస్వామిగా కలిశాడు. దాని గతీ ఉపసంహరణే అయ్యింది. ఇదంతా పెద్ద కుట్ర వలె వుందని గ్రహించిన ఛైర్మన్ ఒక స్వచ్ఛంద సంస్థ కేసు ఆధారంగా న్యాయపోరాటం జరిపాడు. దానిపై పూర్తి స్థాయి విచారణ జరిపిన న్యాయమూర్తులు, వేలం సొమ్ము మొత్తం కడితే తప్ప ఇసుక త్రవ్వడానికి లేదని తీర్పు చెప్పారు.

## వివేకా ఆరాటం

ఏదో రకంగా ఇసుక మాఫియాను కాపాడ డా నికి ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి రంగంలోకి దిగాడు. గొల్లకందుకూరు ఇసుక రేవులో భూగర్భ జలానికి సంబంధించిన నిర్మాణాలు వున్నాయి కాబట్టి, అక్కడ ఇసుక త్రవ్వకానికి అనుమతి నిలపాలని తానే స్వయంగా లేఖ వ్రాశాడాయన. దాని ఉద్దేశం, అనుమతి నిరాకరించినన్ని రోజులూ ప్రభుత్వానికి పైసా కట్టకుండా అక్రమంగా ఇసుక త్రవ్వుకపోవడం. అయితే దీనిపై కూడా ఛైర్మన్ తిరగబడ్డాడు. ఆ రేవులో ఏ నిర్మాణాలు వున్నాయో, వాటివల్ల వచ్చే అడ్డంకులు ఏమిటో సర్వే చేసి, నిజాలు నిగ్గు తేల్చాలని అధికారుల మీద ఒత్తిడి తెచ్చాడు. దానితో భూగర్భజల అధికారులు భయపడిపోయి, అటువంటి సమస్యలేవీ లేవని తేల్చి చెప్పేశారు.

## పాతిక కోట్ల రాబడి

ఈ దెబ్బతో ఇసుక వ్యాపారులు అల్లాడిపోయారు. వేలం నిబంధనల ప్రకారం గడువు లోపల డబ్బు కట్టనివారి డిపాజిట్లను స్వాధీనం చేసుకొని, మళ్లీ వేలం పెట్టాలని ఛైర్మన్ అధికారులను ఒత్తిడి చేయడంతో భయపడిపోయారు. సగం మంది వరకు హడావుడిగా పూర్తి సొమ్ము కట్టేశారు. దానితో ఒక నెలలో జిప ఖాతాకు 19కోట్ల రూపాయల నిధి జమ అయ్యింది. తతిమా వ్యాపారులు తమకిక ఈ వ్యాపారం వద్దని, ఇసుక రేవుల వద్ద తగిన వసతులు లేవు కాబట్టి తాము కట్టిన 25శాతం సొమ్ము వెనక్కు ఇప్పించాలని మళ్లీ కోర్టుకు వెళ్లారు. ఆ వ్యాపారులకు మైనింగ్ అధికారులు అండగా నిలబడుతున్నారు. జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరక్టర్ స్వయంగా హైదరాబాదుకు వెళ్లి, వ్యాపారులతో కలిసి, వారి న్యాయవాదుల సలహా ప్రకారం వెనుక తేదీలతో కాగితాలు సృష్టించి ఇస్తున్నాడట. ఈ మోసం కూడా బయటపడిపోయింది. ఛైర్మన్ మరొకసారి ఆ కేసులలో భాగస్వామయ్యారు. డిపాజిట్ సొమ్ము వెనక్కు ఇవ్వడానికి లేదని అభ్యంతరం పెట్టారు. ఈ కేసులలో కూడా న్యాయం గెలిస్తే జిపకు పాతిక కోట్ల రాబడి వస్తుంది. జిల్లా చరిత్రలో ఇదొక రికార్డు. ఏ సంవత్సరం కూడా ఇసుక ద్వారా జిపకు రెండు కోట్లకు మించి రాబడి రాలేదు. ఛైర్మన్ పట్టుదల, పోరాట పటిమ వల్ల అన్ని కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా నిలిచింది.

రాజకీయాలలో నిజాయితీ పాటించే వ్యక్తులు పదవులలోకి వస్తే ప్రజలకు ఎంత ప్రయోజనమో నిరూపించి చూపాడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి. అవినీతికి అక్రమాలకు పాల్పడే ఆనం సోదరులకు ఇదొక రకంగా చెప్పు దెబ్బ క్రింద లెక్క. ఇసుక దొంగలుగా భ్రష్టుపట్టినా కూడా ఆనం సోదరులకు సిగ్గు లజ్జ కలగడం లేదు. అక్రమ ఆర్జన వస్తే చాలు, జనం తమ నోట్లో కేకరించి ఉమ్మేసినా నష్టం లేదనే స్థాయికి దిగజారిపోయారు. ఆ నీచపు బ్రతుకు బ్రతకకుంటే ఏమి?

## సాగునీటి పనులు

5వ పేజీ కొరవ

హైద్రాబాద్‌కు చెందిన ఎ.కె.ఆర్ కోస్టల్ లిమిటెడ్ కంపెనీ దక్కించుకుంది. పనులు ప్రారంభంలో దాదాపు ఒకటిన్నర సంవత్సరం పూర్తి కావస్తున్న 20కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారు.

## చిన్న పనులు పూర్తికాలేదు!

మీడియం ఇరిగేషన్ క్రింద కనుపూరు కాల్వ ఆధునీకరణ, డిస్ట్రిబ్యూటరీ సిస్టం ఆధునీకరణ, గండిపాళెం ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. కనుపూరు కాల్వ ఆధునీకరణ దాదాపు 70కోట్లకు ప్రభుత్వం కేటాయించగా ఇందులో కేవలం గడిచిన రెండు సంవత్సరాలలో 10కోట్ల రూపాయలను ఖర్చు చేయగలిగారు.

అదేవిధంగా కొమ్మలపూడి బ్రాంచి ఛానల్ బండేపల్లి బ్రాంచి ఛానల్, ముద్దముడి బ్రాంచి ఛానల్ లైనింగ్ పనులు ఇతర కట్టడాల పునర్నిర్మాణ పనులకు 30.40కోట్లు కేటాయించారు. ఈ పనులు కూడా ఎ.పి.ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకే అప్పగించడం జరిగింది. పై రెండు ప్యాకేజి పనులు పూర్తి కానందు వలన ఆయకట్టు రైతుల ఇబ్బంది పడుతున్నారు. మొత్తం జిల్లాలో 800కోట్లకు పైగా సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు జరిగాయి. 2007, 2008 సంవత్సరాల్లో వరదలు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న చెరువులను మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పర్సంటేజీల కోసం కక్కుర్తిపడి అంచనాలను పెంచేందుకే ప్రయత్నిస్తున్నారే తప్ప పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపడం లేదు.

## సబ్ కాంట్రాక్టర్లకు పనులు

కోట్ల రూపాయలు సాగునీటి ప్రాజెక్టు పనులు దక్కించుకున్న కంపెనీలు సబ్‌కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నాయి. దీంతో పనులు ప్రారంభించిన సబ్‌కాంట్రాక్టర్లు కొంతమేర పనులు పూర్తి చేసి తర్వాత చేతులెత్తేస్తున్నారు. అప్పటివరకు చేసిన పనులకు అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించడంలో కూడా నిర్లక్ష్యం చూపుతుండడం కూడా ఇందుకు మరో కారణంగా చెప్పవచ్చు. సాగునీటి సలహా బోర్డు సమావేశంలోనూ, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల గురించి పదే పదే పలువురు ప్రజాప్రతినిధులను లేవనెత్తుతున్నా అధికారుల వైపు నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదు.

పనులు దక్కించుకుని సకాలంలో పూర్తి చేయలేని కంపెనీల అగ్రిమెంట్లను రద్దు చేయడంతోపాటు నాణ్యతా ప్రమాణాలను పాటించని కంపెనీలను సైతం బ్లాకులిస్టులో పెట్టాలని కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. గత నెల 28వ తేదీ జరిగిన సాగునీటి సలహా బోర్డు సమావేశంలో కూడా పలువురు ఎమ్మెల్యేలు పనులు చేపట్టకపోవడానికి కారణం వివరించాలని కోరారు. కాల్వల లైనింగ్, చెరువుల ఆధునీకరణ పేరుతో కాలయాపన జరుగుతున్నందున ఆయకట్టుదారులు పంటలు వేసుకోకుండా నష్టపోతున్నారన్నది ఎమ్మెల్యేల అభిప్రాయం. పనులు పూర్తి చేయలేని కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అధికారులు వారికి మరికొంత గడువును పొడిగించడం సందేహాలకు దారితీస్తుంది.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తే అదనంగా మరో రెండులక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఇరిగేషన్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. తెలుగుగంగ, సోమశిల జలాశయాల సామర్థ్యం పెంచాలన్న లక్ష్యం నీరు గారిపోతుంది. మొత్తం మీద జిల్లాలో సాగునీటి పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

---

## బీటీ వంకాయ

15వ పేజీ కొరవ

క్రిమిని వంకాయను ఆశించే తెగులు పురుగుల జీర్ణకోశంలో చేరి, ఒక విధమైన విషాన్ని విడుదల చేస్తుందట. దానివల్ల ఆ తెగులు పురుగులు చనిపోతాయట. అయితే ఇవే సూక్ష్మక్రిములు వంకాయతోపాటు వాటిని తినే మనుషుల జీర్ణకోశంలోకి కూడా వెళ్లే అవకాశం వుంటుంది కదా? అక్కడ కూడా అవి విషాన్ని విడుదల చేస్తాయి కదా? ఆ విషం వల్ల మనుషులకు కలిగే ఆరోగ్య సమస్యలు ఏమిటి, ఎంతవరకు అన్న పరిశీలన లేకుండా ఆ విత్తనాలను విడుదల చేయడం ఎంతవరకు సమంజసం? ఒక రకంగా చెప్పాలంటే బీటీ వంకాయలు అచ్చం విషంతో సమానం.

## ఎలుకలు, గొర్రెలు చచ్చాయి

బీటీ పత్తి విషయంలో ఇదే జరిగింది. మధ్యప్రదేశ్‌లో ఒక గొర్రెల మంద పొరపాటున బీటీ పత్తి పండించే తోటలోకి వెళ్లింది. ఆ మొక్కల ఆకులు తిన్నది. అంతే, కొద్ది గంటల వ్యవధిలోనే 2500 గొర్రెలు చచ్చిపోయాయి. అమెరికాలో తయారైన ఒక బీటీ టమోటా రకాన్ని ఎలుకలకు తినిపిస్తే కూడా ఇదే జరిగింది. మన దేశంలో బీటీ పత్తి తోటలలో పనిచేసే వ్యవసాయ కూలీలు, రైతులు పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చర్మం మీద మచ్చలు,దురద, ఎర్రగా కమిలిపోయినట్లు దద్దుర్లు, కంటి చూపు మందగించడం, ఆకలి తగ్గిపోవడం వంటి సమస్యలు చాలానే వస్తున్నాయి.

## అందరూ వద్దంటున్నారు

వ్యవసాయ పరిశోధనలలో భారతదేశ కీర్తి పతాకను అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేసిన డాక్టర్ స్వామినాథన్, సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యూల్ బయాలజీ సంస్థ స్థాపకుడు డాక్టర్ పుష్ప భార్గవ వంటి ప్రసిద్ధ శాస్త్రవేత్తలంతా బీటీ వంకాయను అనుమతించరాదని గట్టిగా వాదిస్తున్నారు.

## ఎవరు ముఖ్యం?

ప్రభుత్వానికి ఎవరు ముఖ్యం? ప్రజలా? విదేశీ కంపెనీలు, వాటి లాభాలా? బీటీ వంకాయ ఉత్పత్తికి పెట్టుబడి పెట్టింది అమెరికాకు చెందిన మోన్‌శాంటో కంపెనీ. అమెరికన్ కార్పొరేట్ కంపెనీలంటే మన ప్రధానమంత్రికి మహా మోజు. వారికి ఏ చిన్న సమస్య వచ్చినా ఆయన విలవిల లాడిపోతారు. వారి కోసం ఏ చట్టాన్ని మార్చడానికైనా వెనుకాడరు. అమెరికన్ కంపెనీల పెట్టుబడుల వల్లనే మన దేశం ఆర్థికంగా పురోగమిస్తుందన్నది ఆయన అభిప్రాయం. అయితే ఇది పెట్టుబడుల సమస్య కాదు. లాభాల సమస్య అంతకంటే కాదు. కోట్లాది మంది ప్రజల ఆరోగ్యం, మతపరమైన ఆచారాలు, విశ్వాసాలు, సాంఘిక అలవాట్లకు సంబంధించిన సమస్య.

## నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

అవకాశాన్ని వినియోగించుకొని మోకాళ్ల సమస్యల నుండి బాధితులు బయటపడాలని కోరారు. సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఏవైనా వివరాలు కావాలంటే 98483 56429 ఫోను నెంబరులో సంప్ర దించాలన్నారు.

## గోమతి టాలెంట్ టెస్ట్

ఫిబ్రవరి 7న నాలుగవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు గోమతి స్కూల్ నిర్వాహకురాలు పి.అరుణ తెలిపారు. ఉదయం పది గంటల నుంచి 12.30 వరకు జరిగే ఈ పరీక్షలో ప్రతిభ కనపరచిన వారికి పది నుండి 100 శాతం వరకు ఫీజు రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. పరీక్ష వ్రాసే ప్రతి విద్యార్థికి మెమొరీ కార్డు ఉచితంగా అందజేస్తామన్నారు. టాప్ ర్యాంకర్‌కు ల్యాప్‌టాప్, రెండవ ర్యాంకర్‌కు ఈ నోట్‌ప్యాడ్, మిగతా పది మంది ర్యాంకర్లకు పెన్‌డ్రైవ్‌లు ఇస్తామన్నారు. విఆర్ లా కాలేజి, గోమతి స్కూల్‌లో జరిగే ఈ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రత్నం టాలెంట్ టెస్ట్!

నెల్లూరులో పాతికేళ్లుగా విద్యాసంస్థలు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లు, ఐఐటియన్లుగా తీర్చిదిద్దిన ఘనకీర్తి రత్నం సంస్థలది. అటువంటి సంస్థ హైస్కూల్ విద్యా విభాగంలో మెరికల్లాంటి విద్యార్థులను తయారుచేయను పిడతాపోలూరులో రత్నం ఐఐటి రెసిడెన్షియల్ స్కూల్‌ను పెట్టింది. ఈ స్కూల్‌లో ఐదవ తరగతిలో ప్రవేశం కోసం 'భవిష్య విద్యాజ్యోతి' టాలెంట్ టెస్టను ఫిబ్రవరి 14వ తేది నిర్వహిస్తుంది. గూడూరు, కావలి, వింజమూరు, ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట కేంద్రాలుగా జరిగే ఈ పరీక్షలో ప్రతిభ కనపర్చినవారికి పదవ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తారు. మెరిట్ ఆధారంగా ఫీజుల్లో రాయితీలు ఇస్తారు. స్టేట్, ఐసిఎస్ఇ, సిబిఎస్ఇ సిలబస్‌లో 5, 6, 7, 8, 9 తరగతులు చదివే విద్యార్థులకు ఇంగ్లీషు మీడియంలో టెస్టను నిర్వహిస్తారు. ఈ టాలెంట్ టెస్టు పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకొనే వారు ఫోన్ నెంబర్లు 92480 48099, 92999 99599, 92464 22904, 91606 12314లలో సంప్రదించవచ్చు.

## ఎల్ఎల్ఎఫ్‌లో సైన్స్ గ్యాలా

నెల్లూరు వేదాయపాళెం లిల్లీ లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో సైన్స్ గ్యాలా కార్యక్రమం వేడుకగా జరిగింది. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల గురించి వివరించారు. స్కూల్ కరస్పాండెంట్ ఇసి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విషం నింపిన వంకాయ!

## ● బీటీ వంకాయ విషంతో సమానం. కంపెనీల లాభానికి జనాన్ని చంపుతారా?



భారతీయ సంస్కృతిలో వంకాయ కూరొక అంతర్భాగం. రామాయణ, మహా భారతాలలోనే వంకాయ ప్రస్తావన వుంది. వేదాలలో విశేష ప్రాధాన్యత పొందింది. దాదాపు నాలుగు వేల సంవత్సరాల నుంచి మన దేశంలో వంకాయ పండిస్తున్నట్లు, రకరకాల కూరలుగా వండి తింటున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ప్రపంచంలో మరే దేశంలోనూ ఈ కూరకు ఇంత ప్రాసస్త్యం లేదు. ఆ సీజను ఈ సీజను అనే తేడా లేకుండా సంవత్సరం పొడవునా సాగు చేయగలిగిన ఒకే కూర రకం కావడం దీని ప్రత్యేకత. దేశం మొత్తం మీద 12 లక్షల ఎకరాలలో వంకాయ తోటలు పెంచుతున్నారని అంచనా. అయితే ఏ రైతు కూడా దీన్ని పెద్ద విస్తీర్ణంలో సాగు చేయడు. తనకున్న భూమిలో కొద్ది భాగం మాత్రమే వేస్తాడు. వంకాయకు చీడపీడలు ఎక్కువ కావడం, నీటి అవసరం జాస్తిగా వుండడం, ప్రత్యేకశ్రద్ధ వుంటే తప్ప ఫలింపు రాకపోవడం అందుకు కారణం.

వంకాయ పంటలో దిగుబడి పెంచడానికి, రోగ నిరోధక శక్తి పెంచడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఎన్నో పరిశోధనలు జరిగాయి. జరుగుతున్నాయి. వాటి ఫలితంగా కొత్త కొత్త రకాలు సాగులోకి వచ్చాయి. అయితే శాస్త్రవేత్తలు కొత్త హైబ్రీడ్ వంకాయలను సృష్టించే కొద్దీ కొత్త కొత్త తెగుళ్లు కూడా పుట్టుకొని వస్తున్నాయి. వాటిలో అత్యంత ప్రమాదకరమైనది షూట్ అండ్ ఫ్రూట్ బోరర్ అనే పురుగు. పూర్తిగా పక్వానికి రాకముందే వంకాయలో చేరి, లోపల గుజ్జునంతా గుల్ల చేయడం ఈ పురుగు లక్షణం. ఇరవై ఏళ్ల క్రితం మొదటగా కన్పించింది. శరవేగంతో దేశమంతా విస్తరించింది. దీనివల్ల 50 నుంచి 80 శాతం వంకాయ పంట నాశనమై పోతున్నదని అంచనా. ప్రస్తుతం వాడుకలో వున్న ఏ తెగులు మందులు కూడా దీన్ని నివారించలేక పోతున్నాయి.

### జన్యుమార్పిడి పరిజ్ఞానం

ఈ సమస్యకు పరిష్కారం జన్యుమార్పిడి పరిజ్ఞానం అని ఒక వర్గం శాస్త్రవేత్తల భావన. జన్యుమార్పిడి ప్రయోగాలు ఇరవైఏళ్ల క్రితం నుంచి నడుస్తున్నాయి. ఒక మొక్క లేదా జంతువులోని లోపాలను సరిచేయడానికి, వాటి జన్యువులలోకి వేరొక రకం మొక్క లేదా జంతువు నుంచి సేకరించిన జన్యువును చొప్పించడమే జన్యుమార్పిడి. వ్యవసాయరంగంలో ఈ ప్రయోగం మొదటిసారిగా టమోటో పండు మీద జరిగింది. 1994లో కాల్గనే అనే అమెరికన్ కంపెనీ జన్యుమార్పిడి ద్వారా కొత్త రకం టమోటోను సృష్టించింది. మొదట మొదట అమెరికన్ వినియోగదారులు దీనిపట్ల విశేషమైన ఆసక్తి ప్రదర్శించారు. అధిక ధర ఇచ్చి కొన్నారు. అయితే కొద్ది కాలంలోనే ఈ జన్యుమార్పిడి రకం సాగులో సమస్యలు తలెత్తాయి.

ఆ తర్వాత సోయాబీన్, మొక్కజొన్న, బొప్పాయి, పత్తి, చెరకు, ఉర్లగడ్డలు తదితర పంటలకు జన్యుమార్పిడి వంగడాలను తయారు చేశారు. అమెరికాలో ఈ సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. అమెరికన్ సూపర్‌మార్కెట్‌లో దొరికే పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులలో నూటికి 70 శాతం ఏదో ఒక రకమైన జన్యుమార్పిడి ప్రక్రియకు లోనైనవే అని అంచనా. వారిని చూసి బ్రెజిల్, కెనడా, చైనా వంటి దేశాలు కూడా ఇప్పుడిప్పుడే ఈ తరహా పంటల మీద ఆసక్తి చూపుతున్నాయి. భారతదేశంలో జన్యుమార్పిడి పత్తి పంట విస్తారంగా సాగులో వుంది.

### అధిక దిగుబడుల కోసం

ఈ ప్రయోగాలన్నింటి పరమార్థం అధిక దిగుబడి. ప్రపంచ జనాభా పెరిగే స్థాయిలో ఆహార పదార్థాల ఉత్పత్తి పెరగకపోవడం వల్లనే ఆకలి, పేదరికం రాజ్యం చేస్తున్నాయి; భూవిస్తీర్ణం పెంచలేము కాబట్టి వున్న భూమిలోనే అధిక దిగుబడుల ద్వారా ఈ సమస్య తీర్చగలమని ఒక వర్గం శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ వాదన చాలాకాలం నుంచే వుంది. హరిత విప్లవం, దానికి అనుబంధంగా వెల్లువెత్తిన హైబ్రీడ్ వంగడాలు అందులో ఒక భాగం. దాన్ని మరింత విస్తృతపరచడానికి జన్యుమార్పిడి పరిజ్ఞానాన్ని తెర మీదకు తెస్తున్నారు.

### అదొక భ్రమ

అయితే హైబ్రీడ్ వంగడాల వలె జన్యుమార్పిడి రకాలలో అధిక దిగుబడి రావడం లేదని అమెరికా అనుభవాలు చెప్తున్నాయి. అమెరికన్ వ్యవసాయంలో దాదాపు 70శాతం వరకు జన్యుమార్పిడి రకాల సాగు జరుగుతున్నా ఏ పంటలోనూ ఉత్పత్తి పెరిగిన దాఖలాలు లేవు.

జన్యుమార్పిడి పరిజ్ఞానం ద్వారా మొక్కలలో రోగనిరోధక శక్తి పెరుగుతున్నదని, దానివల్ల పంట నష్టం తగ్గి అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చేసే వాదన. కానీ మన దేశంలో జన్యుమార్పిడి పత్తి పంట సాగు, ఈ వాదనలో పసలేదని తేల్చిపారేసింది. బీటీ పత్తి సాగయ్యే చోట కూడా రకరకాల తెగుళ్లు పంటను పాడు చేస్తూనే వున్నాయి. వారొక రకం తెగులు నిరోధించడానికి జన్యువులను ప్రవేశపెడితే, వేరొక రకం తెగులుతో పంట నాశనమై పోతున్నది.

### పంది జన్యువులతో పంటలు

జన్యుమార్పిడి ఎన్నో రకాలుగా జరుగుతుంది. ఒక మొక్క జన్యువును వేరొక మొక్కలోకి, తెగుళ్లను సృష్టించే సూక్ష్మక్రిముల జన్యువులు, భూమిలో పెరిగే బాక్టీరియా జన్యువులు వంటి వాటిని మొక్కలలోకి, మొక్కల జన్యువులు జంతువులలోకి, జంతువుల జన్యువులు మొక్కలలోకి ఇట్లా పలు రకాలుగా ప్రయోగిస్తున్నారు ఈ పరిజ్ఞానాన్ని. పందులలో నుంచి తీసిన జన్యువులతో కొన్ని పంటలను మార్పు చేసిన దాఖలాలున్నాయి. మరీ ఒళ్లు గగుర్పొడిచే విషయం మనుషుల నుంచి కూడా జన్యువులను సేకరించి ఆహార పదార్థాలలో ప్రవేశ పెడుతున్నారు.

### మనకా పీడ వద్దు

భారతదేశంలో శాఖాహారానికి వున్న ప్రాధాన్యత ప్రత్యేకంగా చెప్పన వసరం లేదు. కోడిగుడ్డు వేశారన్నా అనుమానంతో కేకులు, బిస్కెట్లు కూడా తిననివారు కోట్ల సంఖ్యలో వున్న దేశ మిది. మాంసాహార సంబంధిత పదార్థం నోటిలో పెడితే నాలుకను సూదులతో కాల్చుకొని శుద్ధి చేసుకొనే సదాచార సంపన్నులున్న పుణ్యభూమి ఇది. అటు వంటి చోట జంతువులు, పురుగులు, క్రిములు, చివరకు మానవ శరీరాల నుంచి సేకరించిన జన్యువులతో వంకాయ వంటి శాఖాహార పంటలను ఉత్పత్తి చేస్తే, కోట్లాది మంది మనోభావాలు ఎంతగా దెబ్బతింటాయో ఊహించలేము. నిష్ఠాగరిష్ఠులైన, మతాచారాలను ప్రాణం కంటే మిన్నగా భావించే సదాచారులైన ప్రజలను మోసం చేయడం దారుణమైన నేరం.

### వంకాయే ఎందుకు?

మన దేశంలో పత్తి పంట తర్వాత ప్రవేశపెడుతున్న జన్యుమార్పిడి పంట వంకాయ మాత్రమే. అమెరికాకు చెందిన మోనోశాంటో అనే విత్తనాల కంపెనీ, మహికో అనే మనదేశంలోని విత్తనాల కంపెనీల సంయుక్త భాగస్వామ్యంలో వంకాయ మీద జన్యుమార్పిడి పరీక్షలు జరుగుతున్నాయి. బాసిల్లస్ తురంగీన్‌సిస్ అనే రకం సూక్ష్మక్రిమిని వంకాయలో ప్రవేశపెట్టడమే ఈ ప్రయోగం. ఈ సూక్ష్మక్రిమి ఒకవిధమైన విషపదార్థాన్ని విసర్జిస్తుందట. ఆ విషం వంకాయ తోటలను కబళించే ఫ్రూట్ బోరర్, షూట్ బోరర్ అనే తెగులు పురుగులను చంపుతుందట. ఈ తెగుళ్లు గత ఇరవైఏళ్లుగా మన దేశంలో వంకాయ తోటలను విపరీతంగా నష్టపరుస్తున్నాయి. దీన్ని నివారిస్తుందనే హామీ ఇస్తే లక్షలాది మంది రైతులు ఈ విత్తనాలను ఎగబడి కొంటారన్నది ఈ కంపెనీల వ్యాపార వ్యూహం. 12 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సాగులో వున్న పంట కాబట్టి, వారి లాభాలు వందల కోట్లలో వుంటాయి.

### ఆ హామీ నిజమా?

కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లోని జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ మహికో కంపెనీ తయారుచేసిన బీటీ వంకాయ విత్తనాన్ని వాణిజ్యపరంగా రైతులకు విక్రయించడానికి అనుమతి ఇచ్చింది. దీనిపై 2000 సంవత్సరం నుంచి పరిశోధనలు చేస్తున్నారు. దాదాపు పదేళ్లపాటు పలు ప్రయోగాలు చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సంస్థ, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా ఈ పరిశోధనలలో పాలు పంచుకొన్నాయి. ఇట్లా పండించిన వంకాయలు తినడంవల్ల కలిగే ప్రభావాలను పరిశీలించడానికి ఎలుకల మీద కూడా ప్రయోగాలు చేశారు.

### ఈ పరీక్షలు చాలవు

అయితే కోట్లాది మంది నిత్యం ఆరగించే ఒక శాఖాహార పదార్థానికి జన్యుపరమైన మార్పులు చేసి ప్రవేశపెట్టేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది. ఎన్నెన్నో పరీక్షలు జరపవలసి వుంటుంది. దీర్ఘకాలంలో మనుషుల ఆరోగ్యంపై ప్రభావాన్ని నిశితంగా పరిశీలించవలసి వుంటుంది. కానీ బీటీ వంకాయ విషయంలో అటువంటి పరిశోధనలు జరగలేదు. ఫ్రూట్‌బోరర్ తెగులు నుంచి వంకాయ తట్టుకొంటుందా లేదా అన్న కోణంలో మాత్రమే పరీక్షలు జరిగాయి.

### అది అచ్చంగా విషమే!

బీటీ వంకాయ జన్యుమార్పిడికి ఒక సూక్ష్మక్రిమి వంకాయ జన్యువులోకి చొప్పిస్తున్నారు. ఆ

కొరవ 14వ పేజీలో

# సప్తమ వర్ధంతి

స్వయం కృషితో అభివృద్ధిలోకి వచ్చి ఎల్ల వేళలా మా అభివృద్ధిని కాంక్షించి
మమ్ము తన గుండెలలో దాచుకున్న ప్రేమ మయుడు, మా ఇంటి ఇలవేల్పు



జననం
2-12-1931

మరణం
5-2-2003

## శ్రీ గూడూరు భాస్కరరామిరెడ్డి గారు

(మాజీ మున్సిపల్ కౌన్సిలర్, నెల్లూరు)

మీరు మా మధ్యలేరన్న నిజాన్ని నమ్మలేకున్నాం.
మీరు భువిలో వున్నా, దివిలో వున్నా మీ ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష.

భార్య : గూడూరు రత్నమ్మ

కుమారులు - కోడళ్లు : గూడూరు మాధవరెడ్డి - అనిత
గూడూరు మహేష్‌రెడ్డి M.Tech., M.S., (U.S.A) - శ్రీదేవి B.Tech., (U.S.A)

కుమార్తె : ఎస్.మైథిలి

మనుమలు - మనుమరాండ్రు : శివరూపేష్ (U.S.A), లక్ష్మీలాస్య, సాయిమనితేజ, అశ్రిత్ (U.S.A), బావిక్ (U.S.A)

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.